# నిద్రపోతున్నారండి...

కథ

సదానంద్ శారద



అన్నయ్య, తిక్కన...ఎర్రా ప్రగడ...ముగ్గురి
ని...ముగ్గురిని కవిత్రయం అంటారు....
అన్నయ్య కాదు... నన్నయ్య...నన్నయ్య.!
ఏదోన్నయ్యా... నీకెందుకు?..
పబ్లిక్ స్టేట్‌మెంట్‌లా పైకి చదువుతున్నావ్...
తప్పు చదువుతుంటే వింటూ
ఊర్కోవాలా?...
ఊర్కోదమ్మా పబ్లిక్...
అరేయ్ అన్నాయ్యా...
నువ్వు పబ్లిక్‌వా!..

ట్రింగ్...ట్రింగ్... ఆ ఫోన్ చూడు... నువ్వు చూడరాదా... అబ్బ! చూడు బుజ్జీ.... నేను జాగింగ్‌కు వెళ్తున్నా... బుజ్జీ ఏంట్రా... బుజ్జి!... నేనింకా చిన్నాదాన్నేనా... డిగ్రీ చదువుతున్నా... తెలుసా... తెలుసు.. తెలుసు...నువ్వు డిగ్రీ బాగా చదువుతున్నావ్!... ట్రింగ్...ట్రింగ్... ఆ ఫోన్ చూడు... వస్తా... ట్రింగ్...ట్రింగ్... అబ్బా! పొద్దున్నే ఈ ఫోన్ ఒకటి... మొబైల్‌కు చేయక లాండ్ లైన్‌కు చేస్తున్నారంటే... నా ఫ్రెండ్స్ కాదు. అన్నయ్య ఫ్రెండ్స్ కాదు. అమ్మకే అయుంటుంది... అమ్మకు మొబైల్ లేదేంటీ... ఉంది. స్విచ్ ఆఫ్... ట్రింగ్.. ట్రింగ్... వస్తున్నా... వస్తున్నా...

నాన్న చేశాడేమో!... నాన్నెందుకు అటువంటి తప్పు పని చేస్తారు?.. చేయరుకానీ చేయరు!... ఇంటికి ఫోన్ చేస్తే తప్పా... తప్పు కదూ.. ఆయన ఎక్కడో ప్రశాంతంగా ఉంటున్నారు. ఫోన్ చేసి ఈ లంకలో ఎందుకు కాలు పెడ్తారు?... లంకంటే లంకంత ఇల్లనా?... ఆఁ.. అమ్మ కట్టించుకున్నాది... మంత్రిగా కొన్నాళ్లు చేసింది కదా... అప్పుడే నాన్నకు, తనకు చెడింది....!

ట్రింగ్... ట్రింగ్.. అబ్బా వస్తున్నా... వస్తున్నా... ఇందాక ఏదో చదివాను... అన్నయ్యా... కాదు కాదు... నన్నయ్య, తిక్కన... ఎర్రాప్రగడ... ముగ్గురిని కవిత్రయం అందురు. మరి నలుగురైతే ఏమందురు?.. కవి నలుగురు... ది ఫోర్ పోయెట్స్... ఇంగ్లీషు లెక్చరర్ బాగుంటాడా... తెలుగు లెక్చరరా?.. అందుకు నిన్ను ఉమెన్స్ కాలేజీలో చేర్పించాల్సింది... లెవ్వే.. ఉమెన్స్ కాలేజీలో మన లెక్చెరర్లు ఉండరా... ఉంటారు... బోల్డంత రోమాన్స్... ట్రింగ్... ట్రింగ్.. అబ్బ వస్తున్నా... పని మనిషి ఏమైంది.. పని మనిషి ఏమయ్యాడు?... పట్టు వస్త్రాలు ఏ షాప్‌లో తీసుకోవాలి... మల్లిక అడిగింది- పట్టు వస్త్రాల కోసం హైదరాబాద్ వస్తుందట... అది చిన్నటౌన్‌లో ఉంటుంది కదా-పట్టువస్త్రాలు అక్కడ ఏం బాగుంటాయి?.. బాగుండవు- ట్రింగ్... ట్రింగ్... ఈ పట్టు వస్త్రాలు ఉన్నాయే.. అవి మన సంస్కృతిలో భాగమట!...

పట్టుచీర కట్టుకొని గుడికో, పెళ్లికో పోవడం మన ఆచారమట... సంస్కృతి, ఆచారం ఒక్కటేనా... అమ్మ ఇంకా లేవదేం.. ఇది సంస్కృతా... ఆచారమా?.. లేచి ఆ ఫోన్ అందుకోవచ్చు కదా... రోజంతా రాజకీయాలు నడిపి... నడిపి అలసిపోయింది... ఎలెక్షన్లు దగ్గర పడుతున్నాయట... పార్టీ పనుల్లో మునిగి తేలుతూ.. అమ్మకు ఇరవైనాలుగు గంటలు సరిపోవనుకో... మీ అమ్మ పార్టీలో లీడర్ కదా-అవును.. తెలంగాణ మీద మీ అమ్మ అభిప్రాయం ఏవిటి?.. సరైన సమయంలో సరియైన నిర్ణయం తీసుకుంటుంది... ఆ సరియైన సమయం ఎప్పుడు వస్తుంది... ఎప్పుడో వస్తుంది... మా అమ్మకేం తెలుసు.. అణు ఒప్పందంపై మీ అమ్మ అభిప్రాయం ఏవిటి?.. సరైన సమయంలో సరైన అభిప్రాయం చెబుతుంది... ధరలెట్లా పెరుగుతున్నాయో!... తగ్గించే మార్గం లేదటనా?... సరైన సమయంలో సరైన మార్గం ఉంటుంది- ట్రింగ్... ట్రింగ్... ఆగిపోయిందేం?... కాల్‌రెడీలో ఎవరైంది చూడరాదూ... ఆఁ... వంకాయ్.. అవసరం ఉంటే వాళ్ళే చేస్తారు....

ఇప్పుడు ఎక్కడున్నాం... అన్నమయ్యా... కాదు కాదు... నన్నయ్య, తిక్కన... సాహిత్యం నుంచి దూరం వచ్చేశావ్... ఓహో... సంస్కృతి గురించి కదూ... సంస్కృతి నుంచి దూరం వచ్చేశావ్... మరి దేనికి దగ్గర వచ్చేశాను... రాజకీయానికి... మీ అమ్మ రాజకీయ జీవితంపై నీ అభిప్రాయం ఏవిటి?... సరైన సమయంలో సరిమైన అభిప్రాయం చెబుతా... పోనీ స్నానం ఎప్పుడు చేస్తావో.. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటా.. నీక్కూడా రాజకీయాలు బాగా ఒంటబట్టినాయి... అంతేలే.. ఆవు చేన్లో మేస్తే దూడ గట్టు మీద మేస్తుందా?.. మేయదు- చేన్లోనే మేస్తుంది. అందుకే అప్పుడే రాజకీయాల్లో మునిగి తేలుతున్నావ్!... తేలాలంటే మునగక తప్పదా... ట్రింగ్... ట్రింగ్.. అదిగో మళ్ళీ లాండ్ లైన్... అమ్మకే అయుంటుంది...

ఇంకా నిద్రలేవదేం... లేపితే... కోప్పడుతుంది- అమ్మకు నిద్ర ఇష్టం... నాన్నకంటే ఇష్టం.. అందుకే నాన్న వెళ్ళిపోయాడు. ప్చ్!... పాపం నాన్న... పెళ్ళి చేసుకున్నాప్పుడు అమ్మ రాజకీయాల్లో లేదేమో!... అసలు పెళ్ళే ఒక రాజకీయం అమ్మాయ్!

ఎవరి పెళ్లి?... ఎవరి పెళ్లైనా... మూకుమ్మడి పెళ్ళిల్లు బాగా అవుతున్నాయి....మూకుమ్మడి తలంబ్రాలు... మూకుమ్మడి బాజాలు... మూకుమ్మడికాజాలు... కాజాలు లేవమ్మాయ్... బాజాలే... ట్రింగ్... ట్రింగ్... వస్తున్నా... వస్తున్నా... నువ్వెందుకు వస్తున్నా... వస్తున్నా.. అంటూ కదలడం లేదో ఆ ఫోన్ చేసే వాళ్లకేం తెలుసు... నీకు తెలుసా అంత రాత్మా?.. ఓ... తెలుసు... ఎదురింటి కిటికీలోంచి... ష్... చెప్పకు చెప్పకు.

ట్రింగ్... ట్రింగ్... ఊఁ... పొద్దున్నే ఈ ఫోన్ గోల ఏవిటో... అదే నీ మొబైల్ మోగితే... అందుకు నేదాన్ని... ఒక్క అంగలో కదూ... ఔనవును... డబుల్ అవును.. త్రిబుల్ అవును... ఈ ట్రబుల్ ఏవిట్రా బాబూ... కేబుల్‌వాడు రానీ చెప్తావాడి పని... ఇప్పుడు ఇంగ్లీషు సినిమా ఎట్లా చూడను... ఎదురింటి కిటికీ ఏమయింది... మూసేశారు... మరి స్నానం... పూజ పునస్కారాలు.. అవన్నీ జాంతానై... మొహం కడుక్కున్నా... టిఫిన్ చేశా... బస్!... మీ అమ్మ?. మా అమ్మ కూడా జాంతానై.. కాదుకాదు... నాన్న జాంతాహై... నాన్న పూజలు చేస్తారనే కదా అమ్మకు కోపం... ఎందుకు? పూజలు చేసేవాళ్లు చాలా సిన్సియర్‌గా ఉండాలట... రాజకీయాలకు సిన్సియారిటీ పనికిరాదు కదా... సిన్సియర్‌గా ఉన్నాట్టు నటించాలి...

అవునూ... మీ అమ్మ నిద్ర నుంచి ఎప్పుడు లేస్తుంది?.. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొని... ట్రింగ్... ట్రింగ్... ఆ ఫోన్ మోగుతున్నది... పాపం... అప్పట్నించి. మరీ ఇంత నిరాదరణ పనికి రాదమ్మాయ్ . కిటికీ మూసేశారు... టీవీ ఆఫ్... ఇక ఫోన్ అందుకోరాదూ.... ట్రింగ్... ట్రింగ్... వస్తున్నా... వచ్చె... వచ్చే... వచ్చేశాను... హలో...హలో... ఆఁ ఆఁ... అవునండి... ఉన్నారండి... ఒక్క నిమిషం లైన్లో ఉండండి... ఉంటారు కదా... సరే... ఉండండి...

అమ్మా... అమ్మా... అమ్మోయ్... నిన్నే అమ్మా... అబ్బబ్బ... ఏవిటే!... ఫోన్... ఎవరికి?... నీకే... నాకా... ఆఁ... ఇంత పొద్దున్నా... అవును... ఎవరట?... పార్టీ ఆఫీసు నుంచి... ఏ పార్టీ ఆఫీసు నుంచి?... మీ పార్టీ ఆఫీసు నుంచి... ఇప్పుడు నేను ఏ పార్టీలో ఉన్నాను... ఇంకా నిద్ర నుంచి లేవలేదామ్మ... అవును... నిద్ర నుంచి ఎందుకు లేపుతావ్... నిద్రలో ఉన్నానని చెప్పు... బంగారం లాంటి నిద్రపాడు చేశావు కదే...

హలో... ఆఁ ఆఁ... సారీ అండి... మా అమ్మ... నిద్రలో ఉన్నారండి... ఆఁ... ఇప్పుడు లేవరు... ఆఁ ఆఁ... లేవరు... పెద్ద తుఫాను రావాలి...!

*

